క్లుప్తంగా

నేడు కౌన్సిలింగ్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: డీఎస్సీ 2024 నియామకంలో భాగంగా 1:1లో ఎంపికైన ఉపాధ్యాయులకు మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో పాఠశాలల కేటాయింపుపై కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్లతో పాటు అన్ని కేటగిరీలకు సంబంధించిన అభ్యర్థులు, లాంగ్వేజి పండిట్, పీఈటీ, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఉ. 9 గంటల వరకు జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

విద్యార్థికి సన్మానం



ఫకీర్ యాదుల్‌ను సన్మానిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్: మండలం పరిధిలోని లింగాపూర్‌కు చెందిన ఫకీర్ యాదుల్ ఐటీఐ (వెల్డర్) ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి అవార్డును సాధించాడు. సోమవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ విద్యార్థిని ఖేడ్‌లోని తన స్వగృహానికి పిలిపించుకుని శాలువా, పూలమాలతో సన్మానించి అభినందించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్ అలీ, కంగ్టి మాజీ ఎంపీపీ రామారావు, నాయకులు జ్ఞానేశ్వర్, వీరేశం పాల్గొన్నారు.

శోభాయాత్రలో ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సత్కరించిన నిర్వాహకులు

పటాన్ చెరు: దేవీ నవరాత్రులను పురస్కరించుకొని.. డివిజన్ పరిధిలోని గౌనెమ్మ బస్తీ, రామేశ్వరం బండ, జీహెచ్ఎంసీ కాలనీల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత శోభాయాత్రలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ అంతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్టేజీ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న పూర్వవిద్యార్థులు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983–84లో టెన్త్ పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో స్టేజీ లేకపోవడంతో నిర్మాణానికి సోమవారం పాఠశాల ఆవరణలో భూమిపూజ చేశారు. పూర్వ విద్యార్థులు 2020 జనవరి 12న మిత్ర సోషల్ సర్వీస్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 12 వరకు పూర్తి చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్, అసోసియేషన్ అధ్యక్షుడు వివేకానంద్, ప్రధాన కార్యదర్శి సత్యం, ప్రభాకర్, కృష్ణ, మన్సూర్ అలీ, వెంకటేశం, శివాజీ, లక్ష్మణ్, సతీష్, షేక్ మీరా, సంగారెడ్డి, నర్సింహులు, శివానంద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


నారాయణఖేడ్: కల్హేర్ మండలం ఫత్తేపూర్‌కు చెందిన ఎల్లవ్వకు, బీబీపేటకు చెందిన పీరయ్యకు సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరయింది. సంబంధిత చెక్కులను సోమవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. నాయకులు సుధాకర్డ్డి, మశ్చందర్, గోవింద్, ఈశ్వర్, తుకారాం, సాయిలు ఉన్నారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

సంగారెడ్డి క్రైమ్: జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో తొమ్మిది రోజులుగా నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని టౌన్ సీఐ భాస్కర్ తెలిపారు.

కబళిస్తున్న కాలుష్య భూతం

- విచ్చలవిడిగా వ్యర్థ జలాలు విడుదల
- ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం
- ప్రశ్నార్థకంగా మారుతున్న మానవ మనుగడ



పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యం

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం మండలాల్లో కాలుష్య భూతం బుసలు కొడుతోంది. గడ్డపోతారం, కాజిపల్లి, బొంతపల్లి, దోమడుగు, గుమ్మడిదల బొల్లారం వంటి పారిశ్రామిక వాడల్లో దాదాపు 500కు పైగా పరిశ్రమలు ఉన్నాయి. దీంతో కాలుష్యానికి అడ్డు అదుపు లేకుండా పోతోంది. కట్టడి చేయాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రసాయన పరిశ్రమలే కారణం...

ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో పెద్దసంఖ్యలో రసాయన పరిశ్రమలు ఉండడమే కాలుష్య భూతానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. పరిశ్రమలు నిరంతరం బహిరంగ ప్రదేశాల్లోకి జలవాయు వ్యర్థాలను విడుదల చేస్తున్నాయి. దీంతో ఈ పారిశ్రామికవాడల్లో ప్రజల జీవన స్థితిగతులు దుర్భరంగా మారుతున్నాయి.

వర్షం మాటున కాలుష్యధార..

వర్షం కురిసినప్పుడల్లా రసాయన పరిశ్రమల యాజమాన్యాలు వరద నీటితో సహా రసాయన వ్యర్థ జలాలను అవుట్లెట్ల నుంచి నేరుగా బహిరంగ ప్రదేశాలు కుంటలు, చెరువుల్లోకి విడుదల చేస్తున్నారు. దీంతో కుంటలు, చెరువులు, పొలాలు నిరుపయోగంగా మారుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులు, మత్స్యకారులపై తీవ్ర ప్రభావం..

పరిశ్రమలు విడుదల చేస్తున్న రసాయన వ్యర్థాలతో సమీప గ్రామాల్లోని జనజీవనంతో పాటు మూగజీవులు భారీ మూల్యాన్ని చెల్లించుకుంటున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గడ్డపోతారం పారిశ్రామికవాడలోని పలు రసాయన పరిశ్రమలు విడుదల చేసిన వ్యర్థాలను సేవించి పశువులు మత్యువాత పడ్డాయి. దీంతో రైతన్నలు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. బొంతపల్లి పారిశ్రామికవాడలోని పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థ జలాలు నేరుగా రాయని చెరువులోకి చేరి చేపలు మత్యువాత పడుతున్నాయి. రైతులు, మత్స్యకారులు సమస్యపై పీసీబీ అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించుకునా పట్టించుకునే నాధుడేలేడని వాపోతున్నారు.

తూతూమంత్రంగా పీసీబీ తనిఖీలు

రసాయన పరిశ్రమల యజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నట్లుగా పీసీబీ అధికారుల తీరు ఉందని బాధిత రైతులు, మత్స్యకారులు ప్రజలు ఆరోపిస్తున్నారు. నిరంతరంగా తనిఖీలు చేయకపోవడం, ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం వారి పనితీరుకు నిదర్శనమన్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే తప్ప క్షేత్రస్థాయిలో తనిఖీలు నామమాత్రంగా చేయడమే జరుగుతుందని ప్రజలు చెబుతున్నారు.

కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

గడ్డపోతారం పారిశ్రామికవాడలోని రసాయన పరిశ్రమలు దర్జాగా విషవాయువులను విడుదల చేయడంతో ఘాటైన వాసనలు పీల్చుకొని గ్రామస్తులు ఉక్కిరిబిక్కికి అవుతున్నారు. గ్రామంలోని పురుషులు మహిళలు వృద్ధులు, చిన్నపిల్లలు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. కాలుష్యం నుంచి ఉమ్మడి మండలాలను కాపాడాలని పారిశ్రామిక వాడల ప్రజలు కోరుతున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు



కలపను రహదారి పక్కనే డంపు చేసిన దృశ్యం

వట్‌పల్లి(అందోల్): కరువు కాటకాల నివారణకు ఏకైక ఆయుధం చెట్లను పెంచడమేనని పాలకులు, అధికారులు పదేపదే చెబుతూ పచ్చదనం పేరుతో చెట్లు నాటే కార్యక్రమాలను చేపడుతున్నారు. కాని, అక్రమ కలప వ్యాపారుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. ఎక్కడా చెట్టు కనిపించినా రైతులకు ఎంతో కొంత ముట్టజెప్పి గంటల వ్యవధిలోనే చెట్లను నేల కూలుస్తున్నారు. అందోల్ మండల పరిధిలోని రాంసాన్‌పల్లి గ్రామ శివారులో చెట్లను ఇబ్బడిముబ్బడిగా నరికేస్తున్నారు. గత పదిహేను రోజులుగా పంట చేల వద్ద ఉన్న చెట్లను నరికి రహదారి పక్కనే డంపు చేసి, ఇటుక బట్టీలకు లారీల్లో తరలిస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

ఝరాసంగం(జహీరాబాద్): విజయదశమిని పురస్కరించుకొని దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాత నిమజ్జనం చేశారు. అందులో భాగంగా కప్పాపూర్‌లో నిర్వహించిన నిమజ్జనంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గ్రామసభలతోనే ఇందిరమ్మ కమిటీల ఎన్నిక

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామసభలు నిర్వహించి, ఇందిరమ్మ కమిటీలను ఎన్నుకోవాలని మాజీ జెడ్పీటీసీ పద్మావతి అన్నారు. గ్రామాల్లో కేవలం అధికార పార్టీకి సంబంధించిన కాంగ్రెస్ నాయకులకు మాత్రమే కమిటీల్లో ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలు, అన్ని పార్టీల నాయకులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఎన్నుకున్న కమిటీలను రద్దు చేసి, ప్రజలకు ఆమోదయోగ్యమైన కమిటీని ఎన్నుకోవాలని తెలిపారు.

ఇద్దరు వ్యక్తులు అదృశ్యం



దస్తగిరి (ఫైల్)

జిన్నారం(పటాన్ చెరు): సీతాఫలాలు తీసుకువస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోని దోమడుగులో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి భార్య ఈనెల 12న అమ్మగారింటికి వెళ్లింది. 13న సాయంత్రం ఇంట్లో ఉన్న దస్తగిరి తల్లికి సీతాఫలాలు తీసుకువస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దస్తగిరి భార్య షాహేదా బేగం 14న ఇంటికి వచ్చింది. భర్త కనిపించకపోవడంతో భార్య తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మతిస్థిమితం లేని వ్యక్తి..



దేవుజ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఐలాపూర్ తండా నివాసి రాట్లావత్ దేవుజ(49), ఈనెల 12న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికుల ఇక్కట్లు



బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ



మండుటెండలో బస్సుల కోసం .. వేచి ఉన్న ప్రయాణికులు

సంగారెడ్డి జోన్: వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి చౌరస్తాలో మధ్యాహ్నం మండుటెండలో బస్సుల కోసం వేచి ఉన్నారు. సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు ఏర్పడి వర్షం కురవడంతో ప్రజలు తలదాచుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దసరా పండుగ ఊళ్లకు ఇచ్చి ప్రజలు తిరిగి పట్టణాలకు బయలుదేరడంతో బస్సులు కిక్కిరిసిపోయాయి. బస్టాండ్ లేకపోవడంతో రోడ్డుపైనే గంటలు తరబడి ప్రయాణికులు అవస్థలు పడాల్సి వచ్చింది. కనీస వసతులు కూడా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జాతీయ అవార్డుకు బస్వరాజ్ ఎంపిక

న్యాల్‌కల్(జహీరాబాద్): సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన న్యాల్‌కల్‌కు చెందిన ప్రముఖ కళాకారుడు హోతి బస్వరాజ్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. మార్డన్ హాజ్‌బెండ్రీ శిల్పాన్ని తయారు చేసిందుకు ఆయనకు అవార్డు వరించింది. ఈ అవార్డును ఈ నెల 26న పంజాబ్ జిల్లాలోని అమృత్ సర్‌లోని ద ఇండియన్ అకాడమీ ఆఫ్‌ఫైన్ ఆర్ట్స్‌లో బస్వరాజ్‌కు అందజేయనున్నారు. జాతీయ స్థాయిలో ప్రతి ఏటా చిత్ర, శిల్ప కళా జాతీయ ప్రదర్శనలు జరుగుతుంటాయి. ప్రతిభ కనబర్చిన వారికి నగదుతో పాటు అవార్డులను ప్రధానం చేస్తారు. ఆయన చెక్కిన శిల్పంలో నాగలిపై ఎద్దు, సహజ ఎరువులు తదితర అంశాలు ఉన్నాయి.

చెరకు టన్నుకు రూ.4,500 ప్రకటించాలి

సంగారెడ్డి టౌన్: చెరకు సాగుకు పెట్టుబడి పెరిగింది. కావున ఒక టన్ను ధర రూ. 4500గా ప్రకటించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి మండలం ఫసల్వాదిలోని గణపతి షుగర్ ఫ్యాక్టరీ సీఈఓ యుగేంధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రైతు పండించే చెరకు పంటకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. టన్నుకు రూ.4,500 ప్రకటించాలని, రవాణాకు అయ్యే ఖర్చును యాజమాన్యం భరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నవాజ్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



అంత్యక్రియల్లో పాల్గొన్న క్రాంతికిరణ్

మునిపల్లి,రాయికోడ్(అందోల్): మునిపల్లి మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన అల్లం నవాజ్ రెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. సోమవారం తాటిపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో నవాజ్‌రెడ్డి కీలక పాత్ర వహించారని క్రాంతికిరణ్ గుర్తు చేశారు. నవాజ్‌రెడ్డి మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జైపాల్‌రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనం



దుర్గామాతకు పూజలు చేస్తున్న మాణిక్యం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని వెంకటాపూర్, మద్దికుంట గ్రామాల్లో శరన్నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న దుర్గామాత విగ్రహాన్ని సోమవారం భక్తులు నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో శోభయాత్ర నిర్వహించారు. మహిళలు, యువతీ యువకులు నృత్యాలు చేసి సందడి చేశారు. మహిళలు మంగళహారతులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మద్దికుంట దుర్గామాత మండలి వద్ద డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, నాయకులు అరిఫోద్దీన్, వెంకట్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. శోభయాత్రలో ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కారాములు

పటాన్‌చెరు టౌన్: ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కారాములు అన్నారు. సీపీఎం పటాన్ చెరు ఏరియా రెండవ మహాసభల ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని జెండావిష్కరణను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కార్పొరేటీకరణ విధానాలను మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, పటాన్‌చెరు ఏరియా నాయకులు వాజీద్ అలీ, పాండు రంగారెడ్డి, నాగేశ్వరరావు, పెంటయ్య, జార్జ్, శాంతకుమార్ పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సుల్లో అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఆదర్శ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 10 రోజుల వృత్తి విద్య శిక్షణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న 14 మంది ఒకేషనల్ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అభినందించారు. క్షేత్ర స్థాయిలో శిక్షకురాలు సమీరాఖాన్ ఆధ్వర్యంలో సూపర్ మార్కెట్లు, జనరల్ కిరాణా స్టోర్ వంటి వ్యాపార సముదాయాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. రిటైల్ రంగంలో వృత్తి విద్య నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో కళాశాల ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన నేతలు



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాజీమంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో సోమవారం స్థానిక నేతలు కలసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. మాజీమంత్రిని కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, మాజీ గ్రంథాలయ డైరెక్టర్ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, సీనియర్ నాయకులు ఆదర్శరెడ్డి తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బసవేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని చందాపూర్ గ్రామంలో సోమవారం బసవేశ్వర విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. బీచ్కుండ సోమేశ్వర శివాచార్యులు, తంగడపల్లి శివయోగి శివాచార్యులు ముఖ్యఅతిథులుగా హాజరై, ప్రత్యేక పూజలు చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బసవేశ్వరుడు గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు మల్లికార్జున్ పాటిల్, సంగిశెట్టి, పృథ్వీరాజ్, విశ్వనాథం, మల్లన్న, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

◆ దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం కాసాల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో దుర్గాభవాని మాత విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాల్లో వివిధ పీఠాధిపతులు, పాల్గొని అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ క్యాంటీన్ మూత

సంగారెడ్డి జోన్: సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలోని క్యాంటీన్ తెరుచుకోలేదు. సోమవారం ప్రజావాణికి ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చిన వారు, సాధారణ ప్రజలు, ఉద్యోగస్తులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా ఇందిరా శక్తి రుణ సౌకర్యంతో క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు కేటాయించినట్లు తెలుస్తుంది. అధికారులు చర్యలు తీసుకొని క్యాంటీన్ ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు

◆ పొగాకు రహిత యువతే లక్ష్యం

సంగారెడ్డి క్రైమ్: పొగాకు జిల్లా నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వరంలో పట్టణంలోని జిల్లాకోర్టు, రాజీవ్ పార్క్, బస్టాండ్ పరిసర ప్రాంతాలు మార్కెట్, పోతిరెడ్డిపల్లి చౌరస్తా తదితర ప్రాంతాల్లో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యంగా యువత పొగాకును విచ్చలవిడిగా వినియోగిస్తున్నారని అన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం 60 రోజులు టోబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0 ప్రారంభించడం జరిగిందని తెలిపారు. యువతను పొగాకు వాడకానికి దూరంగా ఉంచడం, పొగాకు రహిత గ్రామాలకు తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సిబ్బంది, ప్రయాణికులు, యువతి, యువకులు పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా, జైలుశిక్ష

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలో టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా, ఏడుగురు వాహనదారులు మద్యం సేవించి పట్టుపడ్డారు. వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఒకరికి జైలుశిక్ష, మిగతా ఆరుమందికి రూ. 2000 చొప్పన జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్ చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కుర్షిద్ కథనం ప్రకారం.. పటాన్‌చెరు అంబేడ్కర్ కాలనీకి చెందిన నవీన్‌కుమార్(35), దసరా పండుగ రోజున స్నేహితులను కలిసి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అదేరోజు రాత్రి మార్కెట్ కాంటా వద్ద సీసీ రోడ్డుపై జారిపడి తీవ్రగాయాలు కావడంతో అతడిని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ దొంగల హల్‌చల్

పటాన్‌చెరు టౌన్: పండుగకు స్వగ్రామానికి వెళ్లిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీకి పాల్పడిన ఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పోచారం గ్రామశివారులో మూడు ఇళ్లలో దొంగతనానికి యత్నించి, రెండిళ్లలో చోరీ చేశారు. ప్రవీణ్ అనే వ్యక్తికి ఇంట్లో ఆరుతులాల బంగారం, రమేష్ ఇంట్లో 30 తులాల వెండి దొంగిలించారు. దొంగతనం చేస్తున్న దృశ్యాలు సీసీ ఫుటేజ్‌లో రికార్డ్ అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని రేజింతల్ గ్రామానికి చెందిన పడమటి ప్రమోద్ ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి బాధిత కుటుంబానికి రూ. 50వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆమె వెంట సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఆశిరెడ్డి పాల్గొన్నారు.

◆ మానవత్వం చాటుకున్న రాకేష్

నారాయణఖేడ్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఎంపీ సురేష్ షెట్కార్ కుమారుడు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ ఆటోలో ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. సోమవారం ఖేడ్ నుంచి రాకేష్ షెట్కార్ కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. మూడుగుంటల చౌరస్తా వద్ద నిజాంపేట మండలం బాచేపల్లి తండాకు చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఖేడ్ వైపు వస్తూ వాహనం అదుపు తప్పి తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన రాకేష్ షెట్కార్ తన వాహనాన్ని నిలిపి క్షతగాత్రుడిని ఆటోలో ఎక్కించి, చికిత్స నిమిత్తం ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. దీంతో క్షతగాత్రుడి కుటుంబీకులు రాకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

◆ చెక్కుల పంపిణీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ గ్రామానికి చెందిన భోజిరెడ్డి, మండలంలోని రంజోల్‌కు చెందిన కిష్టయ్యలు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యేకు విన్నవించుకోగా సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ. 5.50 లక్షలు మంజూరు చేయించారు. పద్మ రూ.3 లక్షలు, తుల్జమ్మకు రూ. 2.50 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ తెగిపడ్డ కరెంట్ తీగలు

జహీరాబాద్ టౌన్: గాలివానకు మండలంలోని పస్తాపూర్ రహదారిపై సోమవారం సాయంత్రం కరెంట్ తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. భారీ ఈదురులు గాలులు వీయడంతో జహీరాబాద్ నుంచి ఝరాసంగం వెళ్లే ప్రధాన రహదారి నుంచి పొలాలకు వెళ్లె కరెంట్ తీగలు తెగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. రోడ్డు గుండా వచ్చి పొయే వారు గమనించి, ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి రోడ్డుపై పడిన తీగలను తొలగించారు. అప్పటి వరకు ట్రాఫిక్ జాంతో జనం అవస్థలు పడ్డారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400